క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ కార్డులు అందజేత



నందిగామ: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందజేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కొమ్మినేని రవి శంకర్ అన్నారు. మండలంలోని మాగల్లు గ్రామంలో అర్హులైన 1042 మందికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ప్రతి కుటుంబంలో అవసరమైతే రూ.25 లక్షల వరకు ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. వైద్య సేవలు అందక ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



జుజ్జూరు(వీరులపాడు): భవన నిర్మాణ కార్మికులకు తమ వంతుగా అండగా ఉంటామని వైస్ ఎంపీపీ షేక్ నాగుల్‌మీరా, వైఎస్సార్ సీపీ నాయకుడు తమ్మిశెట్టి పుల్లయ్య పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో షేక్ రాబి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబానికి 25 కిలోల బియ్యం, రూ.1000 ఆర్థిక సహకారాన్ని శనివారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. ఆపద సమయంలో ప్రభుత్వంతో పాటు తమ వంతుగా కూడా సహకారం అందిస్తామని తెలిపారు. తమకు సహకారం అందించిన నాగుల్‌మీరా, పుల్లయ్యలకు మృతురాలి కుమారులు షేక్ మీరాహుస్సేన్, షేక్ ఖాసీం సైదా, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సీఐటీయూ నాయకుడు లాల్ అహ్మద్ గౌస్, భవన నిర్మాణ కార్మికులు కొమ్ము తిరుపతిరావు, షేక్ రఫీ, షేక్ ఖాదర్, తమ్మిశెట్టి సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

పెనుగంచిప్రోలు: మండలంలోని నవాబుపేట గ్రామంలో ఆదివారం సాయంత్రం సీసీ రోడ్లు, డ్రెయినేజీ, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, రహదారి పనులను ప్రారంభించటం జరుగుతుందని గ్రామ నాయకులు గింజుపల్లి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీ కేశినేని నాని పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అక్కచెల్లెమ్మల విశ్వాసమే జగన్‌కు శ్రీరామ రక్ష

- జగ్గయ్యపేట, కంచికచర్లలో వైఎస్సార్ ఆసరా సంబరాలు
- పాల్గొన్న ప్రభుత్వ విప్ ఉదయభాను, ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, విమలాభాను, పార్టీ నేతలు, మహిళలు



కంచికచర్లలో మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

జగ్గయ్యపేట అర్బన్: అక్కచెల్లెమ్మల విశ్వాసమే జగన్‌కు శ్రీరామ రక్ష అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించినపుడే సంపూర్ణ మహిళా సాధికారత సాధించవచ్చని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మహిళా సాధికార విప్లవానికి నాంది పలికారని చెప్పారు. శనివారం సాయంత్రం జగ్గయ్యపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పేట పట్టణ పరిధిలో వైఎస్సార్ ఆసరా 4వ విడత నమూనా చెక్కును ఉదయభాను, ఆయన సతీమణి సామినేని విమలాభాను లబ్ధిదారులకు అందజేశారు. ఉదయభాను మాట్లాడుతూ పేట నియోజకవర్గ వ్యాప్తంగా రూ.47 కోట్ల 97 లక్షలు వైఎస్సార్ ఆసరా ద్వారా లబ్ధి చేకూరితే అందులో పేట పట్టణంలోని 778 గ్రూపుల్లోని 7,405 మంది అక్కచెల్లెమ్మలకు రూ.6 కోట్ల 22 లక్షల, 10, 866 వారికి లబ్ధి చేకూరిందన్నారు. విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, ఏఎంసీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, గింజుపల్లి వెంకట్రావు, సుందరమ్మ, ఖాదర్‌బాబు, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మునిహేరా, పార్టీ మహిళ, కార్మిక, వాణిజ్య విభాగాల అధ్యక్షుడు మునిని రాజ్యలక్ష్మి, గోగుల వెంకయ్య, చారుగుంట్ల కొండ, మున్సిపల్ కమిషనర్ నాగ మల్లేశ్వరరావు, మెప్మా సీఎంఎం శ్రీధర్, సీవోలు నిర్మల, దుర్గ, వెంకట్, ఆర్పీలు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు అండగా నిలవాలి

కంచికచర్ల : ఆపత్కాలంలో అక్కాచెల్లెమ్మలకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకంతో ఆదుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో వైఎస్సార్ ఆసరా పథకం కింద నాల్గవ విడత మంజూరైన రుణమాఫీ చెక్కును శనివారం అందజేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా సంకల్పయాత్రలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు నాల్గవ విడత కూడా 1467 స్వయం సహాయక సంఘాలకు రూ.13.39,36,354 పంపిణీ చేసినట్లు తెలిపారు. మొత్తం నాలుగు విడతలుగా రూ.55 కోట్లు ఆసరా పథకం ద్వారా రుణమాఫీ అయిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మహిళలంతా అండగా నిలవాలని సూచించారు.

మహిళలను మహారాణులుగా చేయడమే సీఎం జగన్ లక్ష్యమన్నారు. జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షుడు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఏపీఎం కోట భాస్కరరావు, మండల సమాఖ్య సంఘ అధ్యక్షుడు కంచర్ల పద్మావతి, నాయకులు చింతా రవీంద్రనాథ్, చేయూత మార్ట్ అధ్యక్షురాలు ముత్యాల రోజారమణి, డ్వాక్రా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మేలు జరిగితేనే ఓటేయమన్న నేత జగన్

ప్రభుత్వవిప్ ఉదయభాను



మాట్లాడుతున్న విప్ ఉదయభాను, పక్కన నాయకులు, ప్రజాప్రతినిధులు

కొణకంచి(పెనుగంచిప్రోలు): తమ కుటుంబాలకు మేలు జరిగితేనే వైఎస్సార్ సీపీకి ఓటు వేయండని చెప్పిన దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. శనివారం గ్రామంలో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, రూ.90 లక్షలతో డ్రెయినేజీ, రూ.54 లక్షలతో వేదాద్రి నుంచి గ్రామానికి కృష్ణా జలాల కోసం ఏర్పాటు చేసిన పైపులైన్, రూ.70 లక్షలతో నాడు-నేడు పథకంలో నిర్మించిన భవనాలను ప్రారంభించారు. జగనన్న కాలనీలో నూతన గృహాల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో అధికారం కోసం దుష్టచతుష్టయం మాయ మాటలు చెప్పేందుకు మీముందుకు వస్తున్నారని, వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. పథకాలు నిరంతరాయంగా అమలు జరగాలంటే రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. సర్పంచ్ గోనెల దేవి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, వైఎస్సార్ సీపీ మండల, గ్రామాధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, కాకుమాను శ్రీనివాసరావు, శ్రీతిరుపతమ్మవారి ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కనగాల శ్రీనివాసరావు, గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షులు దేవరపల్లి వెంకటేశ్వరరెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, కన్నమాల శామ్యూల్ పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరామర్శ

భీమవరం(వత్సవాయి): గత నెల 30న అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు పిట్టంపల్లి కోటయ్య కుటుంబాన్ని శనివారం తహసీల్దార్ ఎం. రవి పరామర్శించారు. ఈ సందర్భంగా కోటయ్య భార్య త్రివేణి నుంచి వివరాలు సేకరించారు. కౌలు ఎన్ని ఎకరాలు తీసుకున్నారు, ఎన్ని ఏళ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నారు, అప్పు వివరాలు నమోదు చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివరాలు నమోదు చేసి జిల్లా అధికారులకు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు.

ముస్లింల రిలే నిరాహార దీక్షలు

టీడీపీ వైఖరికి నిరసనగా నినాదాలు



రిలే నిరాహార దీక్ష శిబిరంలో ముస్లింలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణం, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముస్లింల సౌకర్యార్థం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను స్థానిక శాంతినగర్‌లోని పుట్టబజారులో సుమారు రూ.6 కోట్ల విలువైన 29 సెంట్ల స్థలంలో రూ.75 లక్షల వ్యయంతో షాదీఖానా నిర్మిస్తుండగా, ఓర్వలేని టీడీపీ వారు కోర్టులో కేసు వేయించి నిలుపుదల చేశారని పలువురు ముస్లింలు ఆరోపించారు. దీనిని నిరశిస్తూ శనివారం జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. శిబిరాన్ని ముస్లిం మత పెద్దలు ప్రార్థనలు నిర్వహించి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉదయభాను సహకారంతో షాదీఖానా నిర్మాణం కోసం నెల క్రితం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా శంకుస్థాపన చేశారన్నారు. ఇది ఓర్వలేని టీడీపీ వారు 31వ వార్డుకు చెందిన ముగ్గురు మహిళలతో కోర్టులో కేసులు వేయించి నిలుపుదల చేస్తూ స్టే తీసుకువచ్చారన్నారు. ఈ షాదీఖానా పూర్తయితే ఎక్కడ ఎమ్మెల్యే ఉదయభానుకు మంచిపేరు వస్తుందోనని ఈ పనిచేశారన్నారు. కేసులు వెనక్కు తీసుకొని షాదీఖానా నిర్మాణానికి సహకరించాలని వారు డిమాండ్ చేశారు. దీక్షలో అల్లా భక్షు, షేక్ సైదా, షేక్ సాలెహ, షేక్ సుభానీ, షేక్ రహంతుల్లా, షేక్ అస్రార్, పఠాన్ కుస్రాన్, షేక్ హాఫీజ్‌కమార్, షేక్ ఆఫీ జఫర్ ఉన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీసెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఫిరోజ్‌ఖాన్, నియోజకవర్గ అధ్యక్షుడు రస్ హుస్సేన్, పట్టణ అధ్యక్షుడు మొహిద్దీన్, వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి జుబేర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎండీ అక్బర్, మైనార్టీ నాయకులు పఠాన్ అక్బర్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ జాన్‌బాషా, ముస్లిం మైనార్టీ నాయకులు, సోదరులు పాల్గొన్నారు. ముస్లింలు చేస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు.

హామీలన్నీ అమలు చేసిన ఏకైక సీఎం జగన్

- ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు
- పెండ్యాలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



పెండ్యాలలో వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

పెండ్యాల(కంచికచర్ల) : అధికారంలోకి వచ్చిన వెంటనే పాదయాత్రతోపాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ, దేశ చరిత్రలోనే ప్రజలకిచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ అని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని పెండ్యాలలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరును అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థిక సాయం అందించడం, ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ, అర్హతగల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసేలా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడేహజరత్, మాజీ సర్పంచి షేక్ ఖాజా పాషా, నాయకులు షేక్‌పీర్‌సామియా, నిస్సార్‌పాషా, షేక్ చాన్ బహదూర్, ఎంఎఫ్, అబ్దుల్‌కరీం, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు వనిత, కాంతారావు, గ్రామసచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



బదిలీపై వెళ్తున్న కమిషనర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: స్థానిక శ్రీకరం కల్యాణ మండపంలో బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం వీడ్కోలు, కమిషనర్‌గా బదిలీపై వచ్చిన హేమమాలిని అభినందన సభ శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్, ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ విజనరీ ఉన్న నాయకునికి విజన్ ఉన్న అధికారి తోడైతే ఏదైనా చేయగలమ న్నారు. నందిగామ పట్టణ అభివృద్ధి అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషితోనే సాధ్యమైందని తెలిపారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ నందిగామ అభివృద్ధిలో జయరాం పని తీరు మరువలేనిదని, అదే విధంగా కొత్తగా వచ్చిన కమిషనర్ కూడా ప్రజలకు మంచి చేసేందుకు సహకరించటంతో పాటు మిగిలిన అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు చొరవ చూపాలని కోరారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సహకారంతోనే నందిగామలో అభివృద్ధి చేయగలిగామని బదిలీపై వెళ్తున్న కమిషనర్ జయరాం పేర్కొన్నారు. తనకు సహకరించిన కౌన్సిల్ సభ్యులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిషనర్ హేమమాలిని మాట్లాడుతూ అభివృద్ధికి, ప్రజలకు మంచి చేసేందుకు తమ వంతుగా పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు. అనంతరం కమిషనర్లను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పాకాలపాటి కిరణ్, ఓర్సు లక్ష్మీ, ఏఈ ఫణి శ్రీనివాస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, చల్లా బ్రహ్మేశ్వరరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, కాలవ వాసు, పాములపాటి రమేష్, కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాలపై టీడీపీ నీచ బుద్ధి

తొర్రకుంటపాలెంలో ఇళ్ల స్థలాల పంపిణీపై కోర్టుకు..



తొర్రకుంటపాలెంలో పేదలకు పంపిణీ చేసే స్థలం

జగ్గయ్యపేట: ప్రభుత్వం పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలపై టీడీపీ నేతలు అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఒక పక్క ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే టీడీపీ నాయకులు మాత్రం అడుగడుగునా మోకాలడ్డుతున్నారు. వివరాలలోకి వెళితే.. పట్టణంలోని తొర్రకుంటపాలెంలోని సర్వే నంబరు 30లో 5.68ఎకరాల ప్రభుత్వ భూమిలో 170 మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు 2021లో సిద్ధం చేశారు. ఆ స్థలంలో తిరుమలగిరి గ్రామానికి చెందిన వ్యక్తి హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చారు. దీంతో పట్టాల పంపిణీకి తాత్కాలిక బ్రేక్ పడింది. అయితే ఇటీవల హైకోర్టును ఆశ్రయించిన వ్యక్తి కేసు వెనక్కు తీసుకోవటంతో పట్టాల పంపిణీకి మార్గం సుగమం అయింది. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం జగ్గయ్యపేట పట్టణంలోని విశ్వబ్రాహ్మణ బజారుకు, చిల్లకల్లుకు చెందిన వ్యక్తులు ఇళ్ల పట్టాలు వద్దంటూ ఈ నెల 6న హైకోర్టును ఆశ్రయించి స్టేటస్ కో తీసుకువచ్చారు. దీంతో కొద్దిరోజుల్లో పట్టాల పంపిణీ చేయాల్సి ఉండగా అది నిలిచిపోవటంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావాలనే కోర్టులను ఆశ్రయించి స్టేలు తీసుకువస్తూ ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే పట్టణంలో కోట్లతో నిర్మిస్తున్న షాదీఖానా, ఊర చెరువు సుందరీకరణ పనులపైకూడా కోర్టును ఆశ్రయించటంతో పనులు నిలిచిపోయాయి.

ఉదయభానును కలిసిన జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ నేతలు



జగ్గయ్యపేట అర్బన్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును శనివారం ఎన్టీఆర్ జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ నేతలు ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్యాల శేషగిరిరావు (శేషు), జిల్లా ప్రధాన కార్యదర్శి పసుపులేటి శివప్రసాద్ మాట్లాడుతూ జూలై 23వ తేదీన రేషన్ డీలర్స్ మీటింగ్ జరగడానికి, డీలర్ల సమస్యలు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, సంబంధిత మంత్రి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి తెలియజేయడమే కాకుండా ఐసీడీఎస్, ఎండీఎం కమీషన్ రూ.23.71 కోట్లు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే ఉదయభాను తన సంపూర్ణ సహాయ సహకారం అందించారని తెలిపారు. ఉదయభానుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్టీఆర్ జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఉప్పుతళ్ల వెంకటేశ్వర్లు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన గోపి

కంచికచర్ల: కారును వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీకొనగా ఓ వ్యక్తి గాయపడిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. మండలంలోని కీసర ఇన్వెంటా కెమికల్స్ ఫ్యాక్టరీ సమీపంలో నేషనల్ హైవేపై విజయవాడవైపు వెళ్లుతున్న కారును వెనుక వస్తున్న బైక్ ఢీకొంది. బైక్‌పై వెళ్లుతున్న గుంటూరు జిల్లా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన గోపి ధనుంజయ రావుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని వైద్య చికిత్స కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదని అన్నారు.

రూ.25 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం



పెనుగంచిప్రోలు: గ్రామంలో పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి శ్రీతిరుపతమ్మవారి ఆలయం వరకు జెడ్పీ నిధులు రూ.25 లక్షలతో నిర్మించే తారురోడ్డు పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. కొద్ది రోజుల్లో పనులు పూర్తి చేస్తామని నాయకులు తెలిపారు. మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కాకాని శ్రీనివాసరావు, పార్టీ నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, రంగిశెట్టి దుర్గాప్రసాద్, నరెడ్ల కిషోర్, తమ్మిశెట్టి సోమయ్య, నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



నందిగామ: మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న పలు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం.. మండలంలోని పల్లగిరి సమీపంలో మున్నేటి నుంచి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఆ సమయంలో ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటితో పాటు ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని వివరించారు.

ముమ్మరంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు



పెనుగంచిప్రోలు: పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ వేగంగా జరుగుతోంది. మండలంలోని సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది ఈరిజిస్ట్రేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. మండలంలో మొత్తం 1165 పట్టాలకు శనివారం వరకు 437 రిజిస్ట్రేషన్లు అయినట్లు తహసీల్దార్ వి.అమ్మాజీ తెలిపారు. పెనుగంచిప్రోలు-1 సచివాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో కార్యదర్శి శ్యామ్, వీఆర్‌ఓలు లక్ష్మి, బేబి, తదితరులు పాల్గొన్నారు.

ఉదయభానును కలిసిన తహసీల్దార్



జగ్గయ్యపేట అర్బన్: పెనుగంచిప్రోలు మండల నూతన తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన అమ్మాజీ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఆయన నివాసంలో కలిసిన ఆమె మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను ఆమెకు అభినందనలు తెలియజేశారు. రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శేషు, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.